# 44 కార్మిక చట్టాలను అమలు చేయాలి

**సిద్దిపేట రూరల్, మే 10, ప్రభాతవార్త:**
నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44కార్మికచట్టాలను అమలుచేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్‌లు డిమాండ్‌చేశారు. జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవనంలో మే20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్‌ను వారు కార్మికులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికవర్గం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 కార్మిక చట్టాలను సమూలంగా రద్దు చేసి పెట్టుబడుదారులకు కార్పొరేట్లకు బడా వ్యాపారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లు బిజెపి ప్రభుత్వం తెచ్చిందన్నారు. కార్మికుల ఉద్యమాలను, పోరాటాలను అణచి వేయడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకుందన్నారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్నిరంగాల కార్మికులుపాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటియూసి నాయకులు పిట్ల మల్లేశం, భిక్షపతి, ఐలయ్య, రాజు,శ్రీనివాస్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


# అక్రమ మట్టి తరలింపుపై రెవిన్యూ సీరియస్

**పుల్‌కల్, మే 10, ప్రభాతవార్త:**
ఉమ్మడి పుల్‌కల్ మండలంలో అక్రమమట్టి తరలింపును రెవిన్యూ అధికారులు సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని గొంగ్లూరు, గంగోజిపేట, శివంపేట, తాడ్దాన్‌పల్లి, సుల్తాన్‌పూర్, చౌటకూరు, సరాఫ్‌పల్లి తదితర గ్రామాల్లో కొందరు అక్రమార్కులు మట్టిదందాను చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ అక్రమంగా జేబులు నింపుకుంటున్నారు. రాత్రివేళల్లో గుట్టు చప్పుడు కాకుండా మట్టినితవ్వి టిప్పర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రివేళల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ప్రజలుచేసిన ఫిర్యాదుతో చౌటకూరు తహసీల్దార్ అనుదీప్ తన సిబ్బందితో గురువారం రాత్రికి తాడ్దాన్‌పల్లి గ్రామశివారు నుంచి మట్టిని తరలిస్తున్న 2టిప్పర్‌లను అదుపులోకి తీసుకుని పుల్‌కల్ పోలీసు ఠాణాకు తరలించారు. మంత్రి దామోదర్ పేరు చెప్పుకుంటూ అక్రమంగా మట్టిదందాను కొనసాగిస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు నత్తి దశరథ్ అధికారుకు సూచించారు. అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనుదీప్ హెచ్చరించారు.

# ఎదుగుదలను చూసి ఓర్వలేకే ఆరోపణలు

**-అసైన్డ్ భూముల్లో వ్యాపారాలు తగునా?.-జోరందుకున్న అధికార, ప్రతిపక్షాల వాదనలు**



రోడ్డుపై లిఫ్ట్ ఏర్పాటుచేసుకుంటున్న దృశ్యం



అసైన్డ్ భూమిలో వ్యాపారాలు చేసుకుంటున్న దృశ్యం

**సదాశివపేట, మే 10, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా సంగారెడ్డి శాసనసభ స్థానం బిఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికా రంలో ఉండటంతో సదాశివపేటలో కాంగ్రెస్ నాయకులు, బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు ఒకరిపై మరొకరు అవినీతి ఆరోపణలుచేసుకుంటూ జిల్లా అధికారుల కార్యాలయాల తలుపులు తట్టుతూ నెవ్వెంత అంటే నువ్వెంత అనేకాడికి చేరుకుంది. ఇందుకు సంబంధించి పూర్తివివరాల్లోకి వెళితే, సదాశివపేట పట్టణంలోని గొల్లకేరిలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్ తన పాత ఇంటిని పడగొట్టి కొత్తగా పునర్నించుకుంటున్న తరుణంలో అటుగా ఉన్న మూడంతస్థుల భవనంలో నివాసముంటూ ఆరోగ్యాన్ని దృష్టిలోపెట్టుకుని (మెట్లు ఎక్కి, దిగడం) లిఫ్ట్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. తనకుచెందిన ఇంటిస్థలంలో లిఫ్ట్ ఏర్పాటు చేసుకునే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ స్థలంలో తాత్కాలికంగా లిఫ్ట్ ఏర్పాటు చేసుకునేందుకు మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందచేసినట్లు తెలుస్తోంది. లిఫ్ట్ ఏర్పాటుకు ప్రభుత్వస్థలం కబ్జాచేస్తున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ జిల్లా, మండల అధికారుల దృష్టికి తీసుకుపోగా పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్‌వైస్‌చైర్మన్ సత్యనారాయణ అధికారాన్ని అడ్డుగాపెట్టుకుని అసైన్డ్ భూముల్లో వ్యాపారాలు నిర్వహిస్తూ అక్రమంగా సంపాదన చేస్తున్నారని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్ జిల్లా,మండల అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# నాచగిరిలో విశేష పూజలు



నాచగిరి క్షేత్రంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

**వర్గల్, మే 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ్మాస్వామి క్షేత్రంలో శనివారం నరసింహస్వామి జయంతి సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ఉత్సవంలోభాగంగా మూడోరోజు మూల మంత్ర హవనములు, సుదర్శన నరసింహ హవనములు, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేసవి సెలవులు, రెండవ శనివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవడం జరిగింది. 55 జంటలు శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు, 6స్వామివారి నిజాభిషేకాలు జరిపించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు సుధాకర్, పాండు, నరేందర్‌లు తగిన ఏర్పాట్లుచేశారు.

# దొడ్డు బియ్యం పంపిణీ..లబ్ధిదారుల ఆందోళన..

**చిన్నశంకరంపేట, మే 10, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం కార్యక్రమానికి ఆదిలోనే హంస పాదు ఎదురయింది. మండలపరిధిలోని టిమాందాపూర్ గ్రామంలో రేషన్ కార్డు లబ్దిదారులకు చౌకధరల దుకాణంలో సన్న బియ్యానికి బదులు దొడ్డు బియ్యం సరఫరా చేయడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాలకు సన్న బియ్యం ఇస్తూ మాగ్రామంలో దొడ్డు బియ్యం ఏంటని ప్రశ్నించారు. అధికారులు స్పందించి సన్నబియ్యం పంపిణీ జరిగేలా చూడాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై వార్త తహసీల్ధార్ అబ్దుల్ మన్నన్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి సన్నబియ్యం పంపిణీ జరిగేలా చూస్తామని తెలిపారు.



దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

# విద్యాధరిలో ఘనంగా శనిత్రయోదశి

**-అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తి స్వాతి**



సామూహిక శని తైలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**వర్గల్, మే 10, ప్రభాతవార్త:**
ప్రసిద్ధ వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలో శనివారం శనిత్రయోదశి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు శనిత్రయోదశి మహోత్సవానికి అంకురార్పణ చేయగా, అనంతరం విశేషసంఖ్యలో తరలివచ్చిన భక్తులు శ్రీశనైశ్చర స్వామివారికి తైలాభిషేకం చేశారు. గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి స్వాతితో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు శనీశ్వరస్వామికి తైలాభిషేకం చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు శ్రీ విద్యాసరస్వతి, శ్రీలక్ష్మీగణపతి, శ్రీచంద్రమౌళీశ్వర, శ్రీకళ్యాణ వేంకటేశ్వర, శ్రీస్వయంభూ శంభు లింగేశ్వర క్షేత్రాలను దర్శించుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో విశేషసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు.

# రోడ్డు సమస్యపై పిహెచ్‌డి విద్యార్థి ఢిల్లీలో విన్నపం

**సిర్గాపూర్, మే 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గైరాన్‌తండాకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక తండావాసులు పడుతున్న పాట్లను తండాకుచెందిన పిహెచ్‌డి విద్యార్థి రాహుల్ హైద్రాబాద్‌లోని నేషనల్ కమిషన్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్‌సిఎస్‌టి)లో ఫిర్యాదుచేసి ఢిల్లీలోని ఎస్‌సిఎస్‌టి సభ్యులు హుస్సేన్ నాయక్‌ను కలుసుకుని సమస్యలను విన్నవించారు. ఈసందర్భంగా విద్యార్థి రాహుల్ మాట్లాడుతూ తండాకు రోడ్డుసౌకర్యం లేకపోవడంతో ప్రజలు నిత్యం పాట్లుపడుతూ ప్రయాణం చేయాల్సివస్తోందని విచారం వ్యక్తంచేశారు. తండా శివారులోని వాగుపై వంతెన నిర్మాణం లేక వర్షాకాలంలో ప్రయాణానికి పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను విన్న హుస్సేన్‌నాయక్ త్వరలోనే సమస్యపరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామి చేశారని పేర్కొన్నారు.

# ప్రజలందరూ సన్మార్గంలో నడవాలి

**-జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుజ్జపు మచ్చేందర్**

**నారాయణఖేడ్, మే 10, ప్రభాతవార్త:**
ప్రజలందరూ సన్మార్గంలో నడవాలని జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుజ్జపు మచ్చేందర్ అన్నారు. శనివారం ప్రసిద్ధిచెందిన మహారాష్ట్రలోని పండరీపూర్ ఆలయంలో రుక్మిణీవిఠలేశ్వరునికి గుర్రపు మచ్చేందర్ ఘనంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులను ఉద్దేశించి జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్ మాట్లాడుతూ, భక్తిద్వారానే ముక్తి లభిస్తుందని, ప్రతి ఒక్కరు పండల్పూర్ దర్శించుకోవాలని, దేవునిసన్నిధిలో చెడును విసర్జించి, మంచిని స్వీకరించాలన్నారు. అనంతరం కరణ్ గజేంద్ర మహారాజుల బృందం జిఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో భక్తులు, జిఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ సభ్యులు, తదితరులు భారీ మొత్తంలో పాల్గొన్నారు.

# సైనికుల క్షేమాన్ని కాంక్షిస్తూ... వర్గల్‌లో ప్రత్యేక పూజలు

**-ధర్మంవైపు నిలిచిన భారతావనిదే విజయం**
**-ప్రముఖ సిద్ధాంతి చంద్రశేఖరశర్మ**

**వర్గల్, మే 10, ప్రభాతవార్త:**
సైనికుల క్షేమాన్ని కాంక్షిస్తూ ప్రసిద్ధ వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలో వేదపండితులు శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ వ్యవస్థాపకచైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ ధర్మంవైపు నిలిచిన భారతావనిదే విజయమని స్పష్టం చేశారు. ముఖ్యంగా శ్రీవిద్యాధరి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు, కృపాకటాక్షాలు దేశ సైనికులు, ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. పాక్ ఉగ్రమూకల దాడికి ప్రతిఘటనగా దేశ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ చారిత్రాత్మకంగా నిలిచి విజయపరంపర కొనసాగిస్తుందని తెలిపారు. ప్రస్తుత క్లిష్టపరిస్థితుల్లో పాలకులు తీసుకునే నిర్ణయాలకు, దేశ ఆర్మీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. దేశ సంక్షేమం, సైనికుల సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు వర్గల్ క్షేత్రంలో ప్రతినిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిద్ధాంతి చంద్రశేఖరశర్మ వివరించారు.

# సజావుగా కొనుగోలు ప్రక్రియ జరగాలి

**-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**



ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**రామాయంపేట మున్సిపాలిటీ, మే 10, ప్రభాతవార్త:**
రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేట లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, కొనుగోలు కి సంబందించిన రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంకు తేమశాతం రాగానే కొనుగోలు ప్రక్రియ మొదలవ్వాలని, ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలు, రైతుల ఖాతా వివరాలను ఎలాంటి ఆలస్యం కాకుండ ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని, సరిపడా టార్పాలిన్ లను, గన్ని సంచులను అందుబాటులో ఉంచుకోవాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి అనుగుణంగా లారీలను ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో మండల ఐకేపి ఎపిఎం రాములు, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

# వాహనాలను తనిఖీ చేసిన ఎక్సైజ్ పోలీస్

**నర్సాపూర్, మే 10, ప్రభాతవార్త:**
మత్తుపదార్థాల రవాణాను నివారించేందుకుగాను మెదక్ ఎక్సైజ్ సూపరిండెంట్ జి.శ్రీనివాస్ ఆదేశాలమేరకు నర్సాపూర్ ఎక్సైజ్ సిఐ గోపాల్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈమేరకు నర్సాపూర్ సంగారెడ్డి ప్రధాన రహదారిలోని బివిఆర్‌ఐటి ఇంజనీరింగ్ కళాశాల వద్ద వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. అనంతరం నర్సాపూర్ మండల పరిధిలోని మాడపూర్, సూర్య తండా, హరియా తండాలలో డ్రగ్స్, మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వీధుల్లో పర్యటిస్తూ మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్పలితాలను ప్రజలకు వివరించారు. ఈమేరకు ఎవరు కూడా మత్తుపదార్థాల జోలికి వెళ్ళవద్దని, ఇల్లు, ఒళ్ళు గుల్ల చేసుకోవద్దని నర్సాపూర్ ఎక్సైజ్ అధికారులు సూచించారు.



వాహనాలను తనిఖీచేస్తున్న నర్సాపూర్ ఎక్సైజ్ పోలీసులు

# భారత సైనికుల పోరాటం అద్భుతం

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**



హనుమాన్ యజ్ఞంలో పాల్గొన్న హరీష్‌రావు

**సిద్దిపేట, మే 10, ప్రభాతవార్త ప్రతినిధి:**
పాకిస్తాన్‌లో ఉగ్రవాదులను ఏరివేయడంలో భారత సైనం అద్భుతంగా పోరాటం చేస్తుందని, పహల్గాంలో అమాయకులైన 26మంది పర్యాటకు లను ఉగ్రవాదులు కాల్చి చంపడం కలిచివేసిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత దేవాలయంలో శనివారం దుర్గాప్రసాద్‌స్వామి వారి ఆధ్వర్యంలో 108హోమగుండాలతో హనుమాన్ యజ్ఞం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉగ్రవాదాన్ని అంతం చేయా లని దేశంలో శాంతినెలకొల్పాలని దుర్గాప్రసాద్ స్వామి ఆశీస్సులతోచేసే హోమం ఫలించాలన్నారు. రాష్ట్రప్రజలు ఎల్లప్పుడూ సుఖఃసంతోషా లతో ఉండాలన్నారు. భారత సైనికులకు బలాన్ని అందించి, ఉగ్రవాదులపై విజయం సాధించాలని ఆకాంక్షించారు. యువతను భక్తిమార్గంలో నడిపిం చడానికి సక్రమంగా క్రమశిక్షణతో నడిచేందుకు హనుమాన్‌దీక్ష ఉపయోగపడుతుందన్నారు. భగ వంతుడిని, తల్లిదండ్రులను పూజిస్తూ కష్టాన్ని నమ్ముకొని జీవితంలో పైకి రావాలన్నారు. సిద్దిపేట కోమటిచెరువులో అద్భుతంగా తెప్పోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొ న్నారు. అలాగే సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 3వవార్డు రంగధాంపల్లిలో హనుమాన్ దేవాల యాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన అన్నదాన భవనాన్ని ప్రారంభించి హనుమాన్ మాలధారణ స్వాములతో కలిసి భిక్షచేశారు.

**దేవాలయ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి..**
సిద్దిపేట వేంకటేశ్వరస్వామి దేవాలయ స్వర్ణోత్స వాలను బ్రహ్మోత్సవాలను వైభవంగా చేద్దామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట వేంకటేశ్వరస్వామి దేవాలయ స్వర్ణోత్స వాల బ్రహ్మోత్సవాలపై శనివారం ఆలయ దాతలు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17నుంచి 22వరకు వేంకటే శ్వరస్వామి దేవాలయంలో 50యేండ్ల స్వర్ణోత్స వాలు, బ్రహ్మోత్సవాలను నిర్వహించడం జరుగు తుందన్నారు. సిద్దిపేట ఖ్యాతిని, అధ్యాత్మికతను చాటిచెప్పాలన్నారు. చిన్నజీయర్‌స్వామి పర్యవేక్షణ లో జరిగే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాల న్నారు. సిద్దిపేట ప్రముఖులను 50ఏళ్లలో ఆలయా నికి సేవలు అందించిన వారిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు.

# డ్యాం నీట మునిగి ఉపాధిహామీ కూలీ మృతి

**పాపన్నపేట, మే 10, ప్రభాతవార్త:**
వాటర్ షెడ్ చెక్ డ్యాం నీట మునిగి ఉపాధిహామీ కూలీ మృతిచెందిన సంఘటన పాపన్నపేట మండలపరిధిలోని అన్నారంగ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, ఉపాధిహామీ సీనియర్, కుటుంబీకులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నారం గ్రామానికి చెందిన జనముల శివరాములు(35) గ్రామశివర్లోని కొత్తకుంటలో ఉపాధిహామీ కూలీపనులు చేసేందుకు శనివారం ఉదయం వెళ్ళగా పనులు నిర్వహిస్తున్న సమయంలో ప్రక్కనే ఉన్న వాటర్ షెడ్ చెక్ డ్యాంలో నీరు ఉండడంతో బహిర్భూమికి వెళ్ళగా ప్రమాదవశాత్తూ నీటిలోపడి మృతిచెందినట్లు తెలిపారు. కాగా బహిర్భూమికి వెళ్లిన శివరాములు ఎంతకూ రాకపోవడంతో స్థానికులు, కూలీలు వెళ్ళి చూడగా నీటిలో పడి ఉండడాన్ని గమనించి వెంటనే వెలికితీసి చూడగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. దీంతో పాపన్నపేట పోలీసులకు, ఉపాధిహామీ క్షేత్రస్థాయి అధికారులకు సమాచారం అందివ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంగయ్య తెలిపారు. కాగా మృతుడికి భార్య పావని, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**కొండాపూర్, మే 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మల్కాపూర్ శివారిలోని వేంకటేశ్వర ఫంక్షన్‌హాల్ ఎదురుగా 65హైవే రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాలప్రకారం శుక్రవారంసాయంత్రం 7గంటల ప్రాంతంలో మృతుడు తన బైక్ పైన సంగారెడ్డి నుండి సదాశివపేట వైపు వెళ్తుండగా వెనక వైపునుండి కంటైనర్ బలంగా ఢీకొట్టడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. అధికారికంగా ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

# నర్సాపూర్ బస్టాండ్‌లో బంగారం అపహరణ

**-పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ**
**-సిసి కెమెరాలను పరిశీలించిన పోలీసులు**

**నర్సాపూర్, మే 10, ప్రభాతవార్త:**
బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ఓ మహిళ బ్యాగులో నుంచి ఆరు తులాల బంగారం గుర్తుతెలియనివ్యక్తులు అపహరించిన సంఘటన నర్సాపూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. ఈసంఘటన వివరాలు ఎస్ఐ బి.లింగం కథనం ప్రకారం ఇలా ఉన్నాయి, వెల్దుర్తి గ్రామానికి చెందిన నాళ్ళచెరువు అనసూయ (50) శనివారం ఉదయం 10గంటల సమయంలో తమ గ్రామమైన వెల్దుర్తినుండి బస్సులో నర్సాపూర్‌కు చేరుకుంది. నర్సాపూర్ బస్టాండ్‌లో ఆమె బంధువుల గ్రామమైన కౌడిపల్లి మండలం వెంకట్రావుపేట్ వెళ్దామని మెదక్ బస్సు గురించి వేచి చూస్తుందని తెలిపారు. ఈక్రమంలో ఆమె తనవెంట తెచ్చుకున్నటువంటి 3తులాల నెక్లెస్, 3తులాల చేతికంకణాలను వేరొక చిన్న హ్యాండ్‌బ్యాగ్‌లో వేసి ఆ బంగారాన్ని తన వద్ద ఉన్న వేరే బ్యాగులో వేసి ఒకసారి ఆ 6తులాల బంగారాన్ని బస్ స్టాండ్‌లో ఓపెన్ చేసి చూసుకుందన్నారు. ఆ 6తులాల బంగారం ఉందని నిర్ధారించుకుంది. ఈ క్రమంలోనే మెదక్ వైపు వెళ్లే బస్సు రాగా ఆ బస్సు ఎక్కి బ్యాగులో దాచిన చిన్న హ్యాండ్ బ్యాగులో చూడగా బంగారం వస్తువులు కనిపించలేదని వాపోయింది. ఈమేరకు బంగారం కోసం బస్సులో చుట్టుపక్కల, బస్టాండ్ ఆవరణలో వెదకగా ఆరుతులాల బంగారం దొరకలేదని ఆవేదన వ్యక్తంచేసింది. బంగారం పోగొట్టుకున్న అనసూయ తన హ్యాండ్‌బ్యాగ్‌లో దాచుకున్నటువంటి ఆరుతులాల బంగారువస్తువులను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని ఫిర్యాదుచేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.లింగం తెలిపారు.

# వీరమరణం పొందిన జవాన్ మురళినాయక్‌కు ఘననివాళులు



జవాన్ మురళినాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హరీష్‌రావు

**సిద్దిపేట అర్బన్, మే 10, ప్రభాతవార్త:**
భారత్-పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళినాయక్ చిత్రపటానికి శనివారం మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణకోసం ప్రాణాలర్పించిన అమరజవాన్లకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని తెలిపారు. జవాన్ మురళినాయక్ చేసిన పోరాటం, చూపిన సాహసం వృథాకాదని భారతదేశం కచ్చితంగా గొప్ప విజయం సాధిస్తుందన్నారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండి జవాన్ల కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించిన కార్పొరేటర్



అభివృద్ధి పనులు ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ జితేందర్‌నాథ్

**అల్వాల్, మే 10 ప్రభాతవార్త:** ప్రజావసరాలు మేరకు అభివృద్ధి సాగుతుందని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని సూర్యనగర్, చంద్రానగర్ నుంచి జ్యోతినగర్ వరకు 25లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న ప్రధాన సిసి రోడ్డు, బాక్స్ డ్రైన్ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ప్రజలు అభివృద్ధికి సహకరించాలని జితేందర్‌నాథ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ యాదవ్, గణేష్ పాల్గొన్నారు.

## చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**అల్వాల్, మే 10 ప్రభాతవార్త:** అల్వాల్ సత్యసాయి సేవా సమితి యువ విభాగం మరియు సమితి బాలవికాస్ గురువులు సంయుక్త ఆద్వర్యంలో చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు శనివారం నిర్వహించారు. సమ్మర్ క్యాంప్‌లో బాగంగా గత పదిహేను రోజులుగా పెయింటింగ్, క్రీడలు, నృత్యం, భారతీయ సంస్కృతి, పెద్దలు పట్ల విధేయత, సంస్కారం తదితర అంశాలుపై చిన్నారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. ఇందులో బాగంగా ఆర్మీ డెంటల్ మెడికల్ కళాశాల వారు చిన్నారుకు కంటి, చెవి, దంత పరీక్షలను సుమారు 80 మందికి చేశారు.

## ఘనంగా స్వయంభు లక్ష్మినరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు



బోరబండ స్వరాజ్‌నగర్ శ్రీ స్వయంభు శ్రీ లక్ష్మినరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో అగ్ని ప్రతిష్టలో పాల్గొన్న దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కల్వల సత్యనారాయణరావు.

**యూసుఫ్‌గూడ, మే 10, ప్రభాతవార్త :** బోరబండ స్వరాజ్‌నగర్‌లోని హరిహర క్షేత్ర దేవస్థానం శ్రీ స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభయ్యాయి. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి సుప్రభాతసేవ, మంగళశాసనం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షా స్వీకారం, మహా కుంభస్తాపన, అగ్నిప్రతిష్ఠ, మూర్తిమంత్ర, మూలమంత్ర హోమములు, ధ్వజారోహణం, భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం సాయంత్రం సామూహిక శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, బలిహరణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలు మూడు రోజులపాటు ఈనెల 12 సోమవారం వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కల్వల సత్యనారాయణరావు తెలిపారు.

## ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు కలిసికట్టుగా ఉండాలి :ముఠానరేశ్



అమ్మవారిని దర్శించుకున్న ముఠానరేశ్ బృందం

**చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త:** ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలంతా కలిసికట్టుగా ఉంటూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని భారతీయ రాష్ట్ర సమితి గాంధీనగర్ డివిజన్ పూర్వ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నేత ముఠానరేశ్ అభిప్రాయపడ్డారు. కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం అవడమే కాకుండా 2028 జరిగే సార్వత్రిక ఎన్నికల నాటికి తిరిగి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో రావడానికి కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పనిచేయాలన్నారు. శనివారం విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెల్లూరు నరేంద్ర, దుల్లా దేవేందర్ పాల్గొన్నారు.

## శివాలయం ప్రహారీగోడ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి : బానుక నర్మధ



కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌తో బేటీ అయిన బోర్డు మెంబర్ బానుక నర్మధ

**కంటోన్మెంట్,మే 10 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు 2వ వార్డు శివా నగర్ లోని శివాలయం, వరద నీటి ప్రవాహానికి ముంపునకు గురి కాకుండా ప్రహారీగోడ నిర్మించాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుకర నర్మధ మల్లికార్జున్, సిఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తెచ్చారు. శనివారం ఆమె బోర్డు సిఈఓ మధుకర్ నాయక్,జాయింట్ సిఈఓ పల్లవి విజయ్ వసీంలతో బేటీ అయి శివా నగర్‌లో నెలకొన్న సమస్యలు వారి దృష్టికి తెచ్చారు. వచ్చే వర్షాకాలంలోపు ఆలయం చుట్టు ప్రహారీగోడ నిర్మించకపోతే ఆలయం ముంపునకు గురౌతుందని వారి దృష్టికి తెచ్చారు. ఎంపీ ఈటెల రాజేందర్ ఈ అంశంపై సిఈఓ దృష్టికి తెచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధికార ప్రతినిధి బి.ఎన్. శ్రీనివాస్, నాయకులు అశోక్, బస్తీ నాయకులు రాములు, జనార్ధన్, దుర్గా, బాల్‌రాజ్, సత్యం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సులు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై అపారమైన ప్రభావాన్ని చూపుతారు

### -ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకల నుద్దేవించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** రోగులను సజీవంగా ఉంచడం, రోగి స్థితిని పర్యవేక్షించడం, రోగి సంరక్షణను నిర్వహించడంతో ప్రారంభించి నర్సులు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై అపారమైన ప్రభావాన్ని చూపుతారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు.కోఠి, డి.హెచ్.ఏం.ఎస్ ఆడిటోరియంలో తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అద్దంకి దయాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, డైరెక్టర్, డిఏంఇ డాక్టర్ ఏ.నరేంద్ర కుమార్, ఐ.ఎన్.టి.యు.సి జాతీయ నాయకులూ ఎండి. ఇబ్రహీం, అసిస్టెంట్ డైరెక్టర్ డిఏంఇ నర్సింగ్ విజయ నిర్మల, ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. నాగన్న గౌడ్, శిక్షణ నర్సుల సంఘం అధ్యక్షులు ఏం.రాజేశ్వరిలు ఆత్మీయ అథితులుగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆధునిక నర్సింగ్ మార్గదర్శకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వత్తులు వెలిగించి అద్దంకి దయాకర్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి వెలిగించి అంతర్జాతీయ నర్సుల దినోత్సవాలని ప్రారంభించారు. ఈ సందర్బంగా అద్దంకి దయాకర్ మాట్లాడుతూ సమాజంలో విద్య, ఆరోగ్యం ముఖ్యమైనవని, ఉచిత విద్య, ఆరోగ్యం కల్పించడానికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మొదటి లక్ష్యంగా పెట్టుకున్నాడని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 పడకల సూపర్ స్పెషలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని, ఇందుకోసం బడ్జెట్ కూడా పెంచిందని తెలిపారు. ప్రొఫెషనల్ నర్సింగ్‌కు ఫ్లోరెన్స్ నైటింగేల్ పునాది వేశారని, క్రిమియన్ యుద్ధంలో గాయపడిన సైనికులను చూసుకోవడం ఆమె చేసిన అద్భుతమైన కృషి అని అన్నారు. ఆమె స్ఫూర్తితో నర్సులు నిబద్దత, అంకిత భావం, కరుణ తో రోగులకు సాధ్యమైనంత ఉత్తమమైన సంరక్షణ లభించేలా చూడాలన్నారు. నర్సులు సమాజంలో ఒక ముఖ్యమైన భాగం అని, ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించడానికి, రోగులకు హాని జరగకుండా లేదా అనారోగ్యానికి గురికాకుండా ఎలా ఉండాలో అవగాహన కల్పించడానికి, వైద్యం ప్రక్రియలో సహాయం చేయడానికి, సంరక్షణ మరియు మద్దతును అందించడానికి ప్రయత్నిస్తారని, నర్సులు సమాజంలో అగ్రగామిగా ఉన్నవారిలో ఒకరని గుర్తు చేసారు. పాకిస్థాన్ తో మన దేశం యుద్ధం ప్రారంభించిందని, సైనికులు గాయపడితే మన రాష్ట్రానికి చెందిన నర్సులు కూడా సేవలు చేయడానికి సిద్ధంగా ఉండాలని అద్దంకి దయాకర్ విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవి కిరణ్ పవ్వడి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎన్. విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి వై. శివసాయి కృష్ణ, సంయుక్త ప్రధాన కార్యదర్శి ఏ. లక్ష్మి దేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ లు పి. కవిత ఎస్. సంజీవన్ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగరాయ గానసభలో అన్నమాచార్య జయంతి ఉత్సవం



పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 617 వ జయంతి గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి. వసుంధర

**చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త:** నవ్య నాటక సమితి, అన్నమాచార్య మిషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 617 వ జయంతి కార్యక్రమాన్ని 12న నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంస్థల ప్రతినిధులు వేమరాజు విజయ కుమార్, కామిశెట్టి గోదాలక్ష్మి, నిష్టల సుధామాల వివరించారు. శనివారం చిక్కడపల్లిలోని సమితి కేంద్ర కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి. వసుంధర నిర్వాహక సంస్థల సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ లో జరిగే ఈ కార్యక్రమములో నృత్య గురువు సీతాప్రసాద్, లక్ష్మి బృందమ్ (కొత్తగూడెం) "అన్నమయ్య కథ" సంగీత నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారని, సంగీత కళాకారులు డాక్టర్ వై. రమాప్రభ, డాక్టర్ ద్విభాష్యం వి. ఎస్. ఎన్. మూర్తిల శిష్య బృందమ్ "అన్నమాచార్య సంకీర్తనా గానం" చేస్తారని సుధామాల వివరించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు బ్రహ్మశ్రీ తాడేపల్లి లోకనాధ శర్మ "అన్నమాచార్య సంకీర్తనా గాన నిపుణ" బిరుదు ప్రదానం చేయబోతున్నట్లు గోదాలక్ష్మి వివరించారు. ఈ గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ ఆర్. చంద్రశేఖర్, రజి త్ ఆకుల, కామిశెట్టి ధనుంజయ (అమెరికా)లు పాల్గొన్నారు.

## వెంకటరామశాస్త్రి స్వరంలో తాళంలో ఆర్థత ఉట్టిపడుతుంది



వెంకటరామశాస్త్రిలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త:** 'వరవీణా మృదుపాణి వనరుహలోచన రాణి మలహర రాగంలో అప్పయ్య దీక్షితార్ కృతితో సూర్యకాంతపుత్ర డాక్టర్ పుచ్చా వెంకటరామశాస్త్రి గానం చేసి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య సూర్యకాంతపుత్ర డాక్టర్ పుచ్చా వెంకటరామశాస్త్రి 'అంబావిలాసం' పేరుతో శాస్త్రీయ సంగీత కచేరి కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. అద్భుతంగా గానం చేసిన వెంకటరామశాస్త్రిలను నిర్వాహక సంస్థ అధినేత మద్దాళి రఘురామ్ ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కిన్నెర సంస్థ ప్రతినిధి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మృదంగంపై పి.జనార్దన్, వయొలిన్‌పై కొండపల్లి శ్రీనివాస్ వాద్యసహకారాన్ని అందించారు. త్యాగరాజస్వామి, శ్యామశాస్త్రి, ముత్తుసాన్వమి దీక్షితార్ విరచిత అమ్మవారి కీర్తనలు శాస్త్రీయంగా స్వర రాగ యుక్తంగా గానం చేశారు. మద్దాళి రఘురామ్ మాట్లాడుతూ విఖాత గాయకుడు బాలమురళీకృష్ణ తర్వాత ఆ స్థాయిలో శాస్త్రీయ సంగీత గానగోష్ఠి చేస్తున్న వారు తెలుగునాట అంతగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటరామశాస్త్రి గణాంకితులనీ, వారి స్వరంలో తాళంలో ఆర్ధత ఉట్టిపడుతుందనానరు

## జూన్ 8,9 తేదీలలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ : బత్తిని గౌరీశంకర్ గౌడ్

**చార్మినార్,మే 10 ప్రభాతవార్త :** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జూన్ నెల 8,9 తేదీలలో అస్తమా బాధితులకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నామని దూద్‌బౌలికి చెందిన బత్తిని గౌరీ శంకర్ గౌడ్ తెలిపారు.ప్రతీ సంవత్సరం మృగశిర కార్తె సందర్బంగా బత్తిని కుటుంబ సభ్యులు గత నూట యానభై ఎనిమిది సంవత్సరాలు నుంచి అస్తమా రోగులకు చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నామని ఆయన తెలియజేశారు.జూన్ నెల 7వ తేదీన హైదరాబాద్ పాతబస్తీ దూద్‌బౌలిలోని బత్తిని కుటుంబం నివాసంలో శ్రీ సత్యనారాయణ స్వామి పూజ,గంగ పూజ జరుగుతుందని,అనంతరం చేప ప్రసాదం తయారు చేసే కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. బత్తిని విశ్వనాధ్ గౌడ్ ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జూన్ నెల 8వ తేదీన ఉదయం 11 గంటలకు చేప ప్రసాదంపంపిణీ కార్యక్రమం ప్రారంభం అవుతుందని 9 వ తేదీ ఉదయం 11 గంటలు వరకు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలియజేశారు. కాగా ప్రతీ సంవత్సరం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని కర్ణాటక,మహారాష్ట్ర,తమిళనాడు,ఒరిస్సా,హర్యానా,బెంగాల్ రాష్ట్రాలు నుంచి అస్తమా బాధితులు చేప ప్రసాదం కోసం వస్తుంటారు.

చేప ప్రసాదం కోసం వచ్చే బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ప్రభుత్వ అధికారులు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం లభించని వారికి దూద్‌బౌలిలోని తమ నివాసంలో 10వ తేదీన చేప ప్రసాదం పంపిణీ చేయనున్నామని బత్తిని గౌరీశంకర్ గౌడ్ వెల్లడించారు.

## ముమ్మాటికి పత్రికా స్వేచ్ఛపై ఏపి ప్రభుత్వ దాడి



ప్లేకార్డులు చేత పట్టి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

**కెపిహెచ్బి కాలనీ, మే 10, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఎలాంటి నోటీసులు లేకుండా "సాక్షి" దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనుంజయ్ రెడ్డి ఇంటికి వెళ్లి సోదాలు చేయడాన్ని తెలంగాణ జర్నలిస్టుల సంఘం నాయకులు ఖండించారు. ఈ మేరకు కెపిహెచ్బి కాలనీలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద శనివారం జర్నలిస్ట్ సంఘాల నాయకు లు ప్లేకార్డులు చేత పట్టి నిరసన చేపట్టారు. ఈ సందర్బంగా మేడ్చల్ జిల్లా అధ్య క్షుడు గడ్డమీది బాలరాజ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, అందుకు సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై అక్రమ సోధాలు చేయడమే అని అన్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించకుండా ప్రభుత్వాలే బాధ్యతగా ఉండాలని, కక్షపూరితంగా దాడి చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు పరమేశ్ ,ఆర్ కె. దయసాగర్, నిమ్మల శ్రీని వాస్ గౌడ్, మాణిక్ రెడ్డి, రాహుల్, నాగరాజు, ప్రవీణ్, జై కుమార్, సాగర్ రెడ్డి, రాము, నవీన్, రమేష్, రాకేష్, కుల్ల రాజు, నరసింహ రావు, వెంకటేష్, రామారావు, హరి కృష్ణ, మారుతి సాగర్, పలు పార్టీల నాయకులు ఐస్ క్రీమ్ వెంకట్ రెడ్డి, శివా రెడ్డి, జొన్నల శ్రీనివాస్ రెడ్డి, వెంకటస్వామి రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు దిలీఫ్, అశోక్ గౌడ్, బిక్షపతి పాల్గొన్నారు.

## తెలంగాణ సాధన ఉద్యమకారుడు అరూరి యాదగిరి



ఆరూరి యాదగిరి చిత్రపటానికి నివాళులర్పించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త:** తెలంగాణ సాధన ఉద్యమకారుడు అరూరి యాదగిరి సంస్మరణ సభ శనివారం గాంధీనగర్‌లోని వాల్మీకినగర్ బస్తీలో జరిగింది. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ హాజరై ఆరూరి యాదగిరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన యాదగిరి గారు ప్రమాదవశాత్తు మరణించడం బాధాకరమని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ అంజలి ఘటించారు. కార్య క్రమంలో బిజెపి నాయకులు సుక్క యాదగిరి, నరసింహ ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో త్రివిధ దళాలకు సంఘీభావ ర్యాలీ

### - జై జవాన్... జై భారత్... నినాదాలతో దద్దరిల్లిన మణికొండ





మణికొండ మున్సిపాలిటీలో భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా ర్యాలీ తీస్తున్న "ది సిటిజెన్స్ కౌన్సిల్" ప్రతినిధుల దృశ్యం

**నార్సింగి, మే 10 ప్రభాతవార్త :**

శనివారం సాయంత్రం మణికొండ మున్సిపాలిటీ "జై జవాన్... జై భారత్..." నినాదాలతో దద్దరిల్లిపోయింది. చింతచెట్టు చౌరస్తా నుంచి యోగా కూడలి వరకు చిన్నా, పెద్ద,ఆడ,మగా అందరూ మువ్వన్నెల జెండాలు చేతబట్టి హిందుస్థాన్ జిందాబాద్... పాకిస్థాన్ ముర్దాబాద్... అంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ ర్యాలీని చూస్తే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు చేస్తున్నారా అన్నట్లు కనిపించింది. "ది సిటిజెన్స్ కౌన్సిల్" ఆధ్వర్యంలో భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ది సిటిజెన్స్ కౌన్సిల్ ప్రతినిధులు సీతారాం ధూళిపాళ, బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ, భారత్‌లోని అమాయక ప్రజలను పొట్టన పెట్టుకుంటున్న పాకిస్థాన్‌కు ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత ప్రభుత్వం గట్టి గుణపాఠం చెప్పిందన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో కేవలం ఇద్దరు మహిళా ఫైటర్లు సగం పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతూ బాంబుల వర్షం కురిపించారని, ఇది భారత సైన్యం సత్తాకు నిదర్శనమన్నారు. కేవలం ఇద్దరు మహిళా ఫైటర్లు సృష్టించిన అలజడికే గజగజ వణికిపోయిన పాకిస్థాన్... అరివీర భయంకరులైన భారత ఫైటర్లు పూర్తిస్థాయి యుద్ధం చేస్తే ప్రపంచ పటంలో కనిపించకుండా పోతావ్ అని హెచ్చరించారు. భారత్ కేవలం ఉగ్రవాద స్థావరాలపైనే దాడి చేస్తే, ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాక్ ఆర్మీ మనదేశంపై ఫైటర్ జెట్లు, డ్రోన్‌లు, మిసైల్స్‌తో దాడి చేసిందని, వారి దాడిని మన సుదర్శన చక్రమైన ఎస్-400.చాలా సమర్థవంతంగా అడ్డుకుందన్నారు. అఫెన్స్‌లో అయినా, డిఫెన్స్‌లో అయినా భారత్‌ను ఎదుర్కోవడం పాక్‌కు చేతగాదన్నారు. భారత సైన్యంకు 140.కోట్ల మంది భారతీయులు ముక్తకంఠంతో అండగా ఉన్నామని, పాక్ ప్రజలు సైన్యానికి వ్యతిరేకంగా ఉన్నారని, బలూచ్ ఆర్మీ పాక్ ఆర్మీని చిత్రవధ చేస్తూ, పట్టణాలనే స్వాధీనం చేసుకుంటుందన్నారు. ఇంటి పోరును సరి చేసుకునే దమ్ములేని పాక్, భారత్‌పై యుద్ధం చేస్తామంటుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పహల్గాం దాడికి భారత జవాన్లు ప్రతీకారం తీర్చుకున్నారని, ఇందుకు భారతీయులుగా తామంతా గర్వ పడుతున్నామన్నారు. భారత సైన్యం వీరోచిత పోరాటాన్ని చూస్తున్న ప్రపంచ దేశాలు వేనోళ్ల కీర్తిస్తున్నాయన్నారు. కొందరు భారతగడ్డపై ఉంటూ, ఇక్కడి గాలి పీలుస్తు, ఇక్కడి ఆహారం తింటూ పాక్‌కు మద్దతు తెలుపుతున్నారని, అలాంటి వారు ఈ దేశంను వదిలి పాక్‌కు పారిపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అండె లక్ష్మణ్ రావ్, ఏర్పుల శ్రీకాంత్, నరేందర్, సుమ నళిని షేక్ ఆరిఫ్‌ల తో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

### -భారీ వృక్షం కొమ్మలను తొలగించిన బోర్డు అధికారులు



సిఖ్ విలేజ్‌లో బారీ వృక్షాని ్న తొలగిస్తున్న కంటోన్మెంట్ బోర్డు ససిబ్బంది, మాజీ బోర్డు మెంబర్ పాండు యాదవ్

**కంటోన్మెంట్,మే 10 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 6వ వార్డు సిఖ్ విలేజ్‌లోని పెద్దమ్మ ఆలయం ముందు ఉన్న బారీ వృక్షాన్ని కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది తొలగించారు. వంద సంవత ్సరాల చరిత్ర కలిగిన బారీ వృక్షం శుక్రవారం అర్ధ రాత్రి కురిషిన ఈదురు గాలులతో విద్యుత్ తీగలు వృక్షంపై పడి ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను, బారీ వృక్షాన్ని మాజీ బోర్డు మెంబర్ పాండు యాదవ్ సిఈఓ దృష్టికి తెచ్చారు. వెంటనే బోర్డు ససిబ్బంది ఆ వృక్షాన్ని తొలగించారు. వెంటనే విద్యుత్,ట్రాఫిక్ పోలీసులు కంటోన్మెంట్ బోర్డు సిబ్బంది రంగ ప్రవేశం చేసి జేసిబి సహాయంతో బారీ వృక్షం కొమ్మలను తలగించి విద్యుత్ సరఫర పునరుద్ధరించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

## హెచ్‌ఎంటి కాలనీలో మారుమ్రోగిన శ్రీ భక్త ఆంజనేయస్వామి మహాపూజ

**కుత్బుల్లాపూర్, మే 10 ప్రభాతవార్త**

చింతల్ హెచ్‌ఎంటి కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని ఆలయంలో శ్రీ భక్త ఆంజనేయస్వామి మహాపూజ కీర్తనలు, భజనలు, భక్తిపారవశ్యంతో మమేకమైంది. శనివారం ఉదయం తొమ్మిదినుండి మధ్యాహ్నం రెండు గంటలవరకు కొలెపాక వెంకట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తజన సందోహానికి హనుమాన్ మాలాధారులు భారీఎత్తున పాల్గొని కీర్తనలు, నినాదాలు, భక్తిపాటలు, ఆటలతో ఆలరించారు. కొలెపాక సాగర్ స్వామి నేతృత్వంలో హనుమాన్ గురుస్వాములు, మాలాధారులకు ఘనసత్కారం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రఘుకుల తిలక రారా...నిన్నెత్తి ముద్దులాడెదరా...కొసల రామా రార కౌసల్యారామా రార అంటూ పాటలతో భక్తులు పరవశమయ్యారు. శ్రీభక్త ఆంజనేయస్వామివారికి విశేశ అభిషేకం, భజన, పూజ,హనుమాన్ ఆశీర్వాదంతో గురుస్వాముల ఆధ్వర్యంలో ఐదుగటలపాటు హనుమాన్ మహాపూజ నిర్వహించారు. కార్యక్రమంలో టియుడబ్ల్యుజె జాతీయ కార్యవర్గ సభ్యులు రంగు వెంకట్, కుత్బుల్లాపూర్ ఉపాధ్యక్షులు నగేంద్రచారి, రాజేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రమాదకరం... జాగ్రత్త



ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాగుల అశోక్

**సైఫాబాద్, మే 10 ప్రభాతవార్త:** రోడ్డు భద్రతపై హిమాయత్‌నగర్‌లోని అటేనాస్ ఫ్రెటర్నిటీ నేషనల్ ఏవియేషన్ అకాడమీ విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ అతి ప్రమాదకరమని, ట్రాఫిక్ నియమాలను పాటించి, భవిష్య త్తును కాపాడుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని బేగంపేట టిటిఐ ఇన్స్పెక్టర్ నాగుల అశోక్ చెప్పారు. రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రైవింగ్‌లోఉన్నప్పుడు సెల్ ఫోన్ ఉపయోగించరాదని, లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో 60 మంది విద్యార్థులు, అకాడమీ సిఇఓ అబ్దుల్ రెహమాన్, డైరెక్టర్ వసీమా, సురేఖ, అయాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ వాతావరణంలో అందాల పోటీల నిర్వహణ సరికాదు

### -ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కెపిహెచ్బి కాలనీ, మే 10, ప్రభాతవార్త**

దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దృష్ట్యా హైదరాబాదులో జరుగుతున్న అందాల పోటీలు విషయంలో ప్రభుత్వం పునరాలోచించుకోవాలని దేశ ప్రజలందరూ ఒక రకమైన యుద్ధ వాతావరణ పరిస్థితుల్లో ఉండడం కారణంగా అందాల పోటీలు నిర్వహించడంపై ప్రభుత్వం నిర్ణయించుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి ఒక్కరం కూడా దేశానికి అండగా నిలబడాలని సైనికులకు, వారి కుటుంబాలకు మేమున్నామన్న ధైర్యాన్ని కల్పించే సంకల్పం వారి ముందు ఉంచేలా చూడాలని చెప్పారు. రాష్ట్ర ప్రజల్లో ఇటువంటి సమయంలో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాల్సింది పోయి ఇటువంటి అందాల పోటీలు నిర్వహించడం కార్యక్రమాలపై ఎక్కువ శ్రద్ధ చూపకుండా పరిస్థితులు అన్వేషించుకుని ముందుకు వెళ్లాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వానికి సూచించారు.

## సిసి టీవీ కెమేరాల ఏర్పాటుకు ప్రాధాన్యం

### -ఎసిపి కె.శ్రీనివాస్ రావు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎసిపి కె.శ్రీనివాస్ రావు

**కొంపల్లి, మే 10, ప్రభాతవార్త**

కూకట్పల్లి పోలీస్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏసీపీ కె.శ్రీనివాస్ రావు తెలిపారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ 191 కాలనీలో 16 సీసీ టీవీ కెమెరాలను శనివారం ఏసీపీ కె.శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కమ్యూనిటీ కెమెరాల్లో భాగంగా ఆలయంతో పాటు ఒక నిర్మానుష్య ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేసినట్లు సీఐ జె.ఉపేందర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఇంపీరియల్ గార్డెన్ యజమానిపై కేసు నమోదు


**కంటోన్మెంట్,మే 10 ప్రభాతవార్త:** ఫంక్షన్ హాల్ బుక్ చేసుకొని అనివార య్ కారణాలతో రద్దు చేసుకున్నందుకు అడ్వాన్ డబ్బులు తిరిగి ఇవ్వనని చెప్పడంతో పాటు ఓ మహిళను ఫంక్షన్ హాల్ యజమాని దుర్భాశలాడినందుకు బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు,ఎస్.ఐ.శ్రీధర్‌లు తెలిపిన వివరాల ప్రకారం ట్యాంక్ బండ్ ప్రాంతానికి చెందిన రమాదేవి అనే మహిళా గత మార్చి 19న వివాహం ఉందని బోయిన్‌పల్లి పోలీసస్‌స్టేషన్ పరిధిలోని సిఖ్ విలేజ్‌లోని ఇంపిరియల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌ను 2 లక్షల రూపాయలు అడ్వాన్ రూపంలో చెల్లించింది బుక్ చేసుకుంది. అనివార్య కారణాల వల్ల పెళ్లి వాయిదా పండింది. దీంతో ఆ మహిళా ఫంక్షన్ హాల్‌ను రద్దు చేసుకొని తాను చెల్లించిన 2 లక్షల రూపాయలు అడ్వాన్ డబ్బులు చెల్లించమని కోరింది. దీంతో ఫంక్షన్ హాల్ యజమాని కైలాస్ అగర్వాల్, డబ్బులు ఇవ్వనని ఆమెను బెదిరించడంతో పాటు దురుసుగా,అసభ్యకరంగా మాట్లాడినందుకు బాధితురాలు బోయిన్‌పల్లి పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. రమాదేవి ఫిర్యాదు మేరకు ఫంక్షన్ హాల్ యజమాని కైలాస్ అగర్వాల్‌పై కేసు నమోదు చేసినట్లు బోయిన్‌పల్లి పోలీసులు తెలిపారు.




మదాపూర్‌లోని బిఎఐ కార్యాలయం ఆవరణలో బిఎఐ ప్రతినిధులు వీరజవాన్లకు మద్దతుగా సంఘీభావ ర్యాలి నిర్వహించిన దృశ్యం

# దళారులకు అడ్డాగా "సీఈఐజీ"

- తనిఖీల నుంచి సర్టిఫికెట్ల జారీ వరకు అన్నింట్లోనూ వారే కీలకం
- డ్రాయింగ్ అప్రూవల్ నుంచి సైట్ విజిటింగ్ వరకు ప్రత్యేక ప్యాకేజీ
- ఒక్కో ఫైల్‌కు రూ.50 వేల నుంచి 1లక్ష వరకు వసూలు
- అడిగినంత చెల్లించుకోలేక వినియోగదారుల గగ్గోలు



**హైదరాబాద్, మే 10,ప్రభాతవార్త:** తెలంగాణ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్‌స్పెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ (సీఈఐజీ) ఆఫీసు కన్సల్టెన్సీలకు, మధ్య దళారీలకు అడ్డగా మారింది. ఇక్కడ ఏళ్లుగా పాతుకుపోయిన కొంత మంది ఇన్స్‌పెక్టర్లు ప్రత్యేకంగా దళారులను నియమించుకుని చేతికి మట్టి అంటకుండా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. విద్యుత్ భద్రతా తనిఖీల పేరుతో ఒక్కో కేటగిరి కనెక్షన్‌కు ఒక్కో ప్యాకేజీ నిర్ణయించి అందినకాడికి దండుకుంటున్నారు. దరఖాస్తుదారుల నుంచి నేరుగా తీసుకుంటే ఏసీబీకి పట్టుబడే అవకాశం ఉందని భావించి నమ్మకమైన కన్సల్టెంట్ల ద్వారా సీఈఐజీలు మొత్తం తతంగాన్ని నడుపుతున్నారు. విద్యుత్ కాంట్రాక్టర్లకు ఏ, బీ గ్రేడ్ లైసెన్స్‌ల జారీ, రెన్యూవల్ మొదలు.. కొత్త పరిశ్రమలు, అపార్ట్‌మెంట్లు, సినిమాహాళ్లు, వాణిజ్య భవనాలు, పాత హెటీ కనెక్షన్ల పీరియాడికల్స్ ఇన్స్ పెక్షన్లకు కూడా భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఆయా కేటగిరీలకు చెందిన వినియోగదారులు ఈ సీఈఐజీ ఇన్స్‌పెక్టర్ల తనిఖీల పేరు చెప్పితేనే బెంబెలెత్తిపోతున్నారు. సాధారణంగా 15 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు నిర్మించిన బహుళ అంతస్థుల (వాణిజ్య, నివాస) భవనాలతో పాటు 15 విద్యుత్ మీటర్లకు మించి దరఖాస్తు చేసుకున్న భవనాలకు, విద్యుత్ డిమాండ్ 75 కిలోవాట్స్‌కు మించిన హెచ్‌టీ కనెక్షన్ల జారీకి సీఈఐజీ అనుమతిని ప్రభుత్వం తప్పని సరి చేసింది. దీన్ని అవకాశంగా తీసుకుని పలువురు సీఈఐజీ ఇన్స్‌పెక్టర్లు బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. అంతర్జాతీయ గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరానికి శివారులోని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. విశాలమైన విస్తీర్ణంలో వేలాది ఎకరాల భూములు సహా అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు ఇక్కడ ఉంది. తక్కువ ధరకే ఇక్కడ భూములు దొరుకుతుండటం, మానవ వనరులు కూడా పుష్కలంగా అందు బాటులో ఉండటం, పెట్టుబడి దారులకు ప్రభుత్వం పలు రకాల ప్రోత్సాహకాలు ప్రకటించడంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టి వాణిజ్య వ్యాపార కార్యకలాపాలను కొనసాగించేందుకు దేశవిదేశాలకు చెందిన అనేక ప్రముఖ కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయి. ఆయా కంపెనీల్లో ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ యువత పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంది. వీరిలో అనేక మంది ఇక్కడ స్థిరపడేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా రియల్ ఎస్టేట్ రంగానికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. నివాస, వాణిజ్య అవసరాల కోసం ఔటర్‌కు అటు ఇటుగా ఆనుకుని కొత్తగా అనేక బహుళ అంతస్థుల భవనాలు వెలుస్తున్నాయి. ఐటీ ఉత్పత్తులు సహా ఫార్మా పరిశ్రమలతో ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్ సినిమా థియేటర్లు, స్టార్ హోటళ్లు, క్లబ్బులు, పబ్బులు, స్టోన్ క్రషర్ మిషన్లు భారీగా వెలుస్తున్నాయి. కొత్తగా వెలుస్తున్న ఈ బహుళ అంతస్తుల భవనాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు విద్యుత్ తనిఖీ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

**కారులో నుంచి కాలు కదపకుండానే..**

బహుళ అంతస్థుల భవనాలు, సినిమా హాల్స్, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, స్టార్ హోటళ్లు, క్లబ్బులు, పబ్బులు, ఐటీ అనుబంధ కంపెనీలు, ఆస్పత్రులు, ఫార్మా ఇండస్ట్రీలు, చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమలు సహా సోలార్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు, స్టోన్ క్రషర్ మిషన్లు, టింబర్ డిపోలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసే పెద్దపెద్ద ఎగ్జిబిషన్లకు విద్యుత్ కనెక్షన్లు జారీ చేయాలంటే ముందు సీఈఐజీ నుంచి నిరభ్యంతర పత్రం పొందాల్సి ఉంది. భవిష్యత్తులో విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా విద్యుత్ డిమాండ్ మేరకు విద్యుత్ వైరింగ్ సహా స్విచ్ బోర్డులు, ప్లగ్స్, జంక్షన్ బాక్స్‌లు, ప్యానల్ బోర్డులు, మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్తింగ్ సిస్టం పరికరాల ఏర్పాటు, వాటి నాణ్యతను పరిశీలించి ఎలాంటి ప్రమాదం లేదని నిర్ధారించుకుని నిరభ్యంతర పత్రం జారీ చేస్తుంటారు. ఆ తర్వాతే విద్యుత్ అధికారులు ఆయా భవనాలకు మీటర్లు, కనెక్షన్లు జారీ చేస్తుంటారు. అయితే అడిగినంత ఇచ్చి..ప్రత్యేకంగా కారును ఏర్పాటు చేసి విజిటింగ్‌కు తీసుకెళ్తే..కనీసం కారు డోరు కూడా తెరవకుండా బయటి నుంచే చూసి ఎన్‌ఓసీలు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు ఒక్కో భవనం తనిఖీకి రూ.20 వేలకు పైగా తీసుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. విద్యుత్ కాంట్రాక్టర్లకు లైసెన్స్‌ల జారీ కోసం కూడా భారీగా వసూలు చేస్తున్నారు.

**స్పష్టత లేకపోవడమే..**

ఎంత ఎత్తులో ఉన్న భవనానికి, ఎన్ని కిలోవాట్లకు మించిన భవనాలకు ఈ సీఈఐజీ కావాలనే అంశంపై ఇటు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇంజనీర్లు, అటు భవన నిర్మాణ సమయంలో విద్యుత్ వైరింగ్ పనులు దక్కించుకున్న ప్రైవేటు విద్యుత్ కాంట్రాక్టర్లకు కూడా దీనిపై సరైన అవగాహన లేదు. అధికారుల్లోనే కాదు ప్రజల్లోనూ దీనిపై పెద్దగా అవగాహన లేదు. దీన్ని వారు అవకాశంగా తీసుకుంటున్నారు. వారికి అవగాహన కల్పించాల్సింది పోయి..అడ్డగోలు దోపికిడి పాల్పడుతున్నారు. కేవలం సీఈఐజీ ఇన్స్‌పెక్టర్లు మాత్రమే కాదు డ్రాయింగ్ అప్రూవల్ కన్సల్టెన్సీలు, డిస్కం ఏడీఈలు, సబ్ ఇంజనీర్లు, ఏఈలు, విద్యుత్ కాంట్రాక్టర్లు, ఇలా ఎవరికి వారు భవన యజమానులను మోసం చేస్తున్నారు. ఆయా సర్టిఫికెట్ల పేరుతో వారి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.నిజానికి వినియోగదారుడు ఎంచుకున్న లోడు వివరాలతో పాటు కంపెనీ సర్టిఫికెట్, పనిపూర్తి చేసినట్లు సర్టిఫికెట్, టెస్ట్ రిపోర్ట్ సహా ఫీజు చెల్లించాలి. రిపోర్ట్స్ అన్ని సమర్పించిన మూడు రోజుల్లో తనిఖీ చేయాలి. పత్రం జారీ చేయాల్సి ఉంది. మొత్తం ప్రక్రియ 11 రోజుల్లో పూర్తి కావాల్సి ఉంది. కానీ రోజుల తరబడి తిప్పుకుంటున్నారు. నిజానికి ఇందుకు అన్ని రకాల ఛార్జీలు కలిపితే రూ.15-20 వేలకు మించదు. కానీ మధ్య దళారులు ఆయా వినియోగదారుల నుంచి రూ.50-1లక్ష వరకు వసూలు చేస్తుండటం గమనార్హం.

**షార్ట్‌సర్క్యూట్‌లకు ఇదే ప్రధాన కారణం..**

1000 కేవీఏ సామర్థం ఉన్న కనెక్షన్లను సీఈఐజీ తనిఖీ చేయాలి. 125 కేవీఏ నుంచి 1000 కేవీఏ లోపు కనెక్షన్లు డివిజన్ ఇంజనీర్లు తనిఖీ చేయాలి. 10 కిలోవాట్స్ నుంచి 125 కేవీఏ లోపు కనెక్షన్లు సబ్ డివిజనల్ ఆఫీసర్ తనిఖీ చేయాలి. ఈ సమయంలో వైరింగ్, బాక్స్‌లు, క్యాబినెట్ కటౌట్ బాక్సులు, సర్వీసు వైరు, ఫీడర్స్, ఫ్లోరింగ్ సహా రూఫ్, సర్క్యూట్స్, కిచెన్, డైనింగ్ రూమ్, ఇలా మొత్తం 77 అంశాలను పరిశీలించాల్సి ఉన్నప్పటికీ.. అడిగినంత ఇస్తే చాలు కనీసం కారు కూడా దిగకుండానే ఎన్‌ఓసీలు జారీ చేస్తున్నారు. ఫలితంగా ఆయా భవనాల్లో వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు ప్రారంభమైన కొద్ది రోజులకే నాసిరకం కేబుళ్లు, ఎర్తింగ్ వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి యజమానులు పెద్ద మొత్తంలో ఆస్తి నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

## ప్రముఖ సంగీత విద్వాంసురాలు ములకలూరి లక్ష్మీ కృష్ణకు జీవిత సాఫల్య పురస్కారం

**చిక్కడపల్లి, మే 10 ప్రభాతవార్త:** శ్రీ కమలాకర చారిటబుల్ ట్రస్ట్, కమలాకర్ లలిత కళా భారతి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ లోని కళా సుబ్బారావు కళా వేదికలో తాళ్ళ పాక అన్నమాచార్యుల జయంతి సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసురాలు ములకలూరి లక్ష్మీ కృష్ణకు జీవిత సాఫల్య పుర స్కార ప్రధానోత్సవ సభ నిర్వాహక సంస్థ అధినేత్రి భారతి కమలాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా ప్రముఖ సంగీత దర్శకులు ఉదయ్ కుమార్ హాజరై ఈ పురస్కారం ను లక్ష్మీ కృష్ణకు ప్రధానం చేసి ప్రసంగించారు. సభకు తెలుగు విశ్వవి ద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టీ.గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో చారిత్రక నవలా చక్రవర్తి ఆచార్య ముదిగొండ శివప్రసాద్, ప్రముఖ సాహి తీవేత్త డాక్టర్ ముక్తేవి భారతి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంత లక్ష్మి , కె.లలిత్ పరమేశ్వరి, జి.కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయని పద్మజవల్లి బృందంచే శ్రీ శ్రీహరి పద సేవార్చనఖి కార్యక్రమం భక్తి పూర్వకంగా సాగింది.

## అక్రమ వలసదారులపై చర్యలు తీసుకోవాలి

**కెపిహెచ్బి కాలనీ, మే 10, ప్రభాతవార్త** కూకట్‌పల్లి నియోజకవర్గంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్ రోహింగ్యా దేశాలకు చెందిన వ్యక్తులు అక్రమంగా నివసిస్తూ, నకిలీ పత్రాలతో మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై బీజేపీ నేతలు కూకట్‌పల్లి పోలీసులకు శనివారం వినతిపత్రం అందించారు. జాతీయ భద్రతకు ఈ పరిస్థితి ముప్పుగా మారుతున్నదని వారు అన్నారు. ఈ మేరకు కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు నాయకత్వంలో బీజేపీ ప్రతినిధుల బృందం కూకట్‌పల్లి సీఐను కలిసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వ రరావు ఈ కార్యక్రమంలో పాల్గొని దేశ భద్రత కోసం ప్రతి ఒక్కరూ గళం వినిపించాల్సిన సమయం ఇదేనని ఉగ్రవాదం మానవతకు విరుద్ధమైన నేరం అన్నారు. దేశ భద్రత, ప్రజల శాంతి, అభివృద్ధికి ఇది పెద్ద అడ్డంకి అని మనం ఐక్యంగా నిలబడి ఉగ్రవాదాన్ని శాసించి, సమాజాన్ని శాంతియుతంగా తీర్చిదిద్దాలనీ చెప్పారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, జిల్లా కార్యదర్శి తూము శైలేష్ కుమార్, పాల్గొన్నారు.





## అట్టహాసంగా ప్రారంభమైన మిస్‌వరల్డ్ పోటీలు

**హైదరాబాద్, మే 10,ప్రభాతవార్త :** నగరంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 110కిపైగా దేశాలకు చెందిన సుందరీమణులు ఈ కిరీటం కోసం పోటీపడుతున్నారు. భారత్ తరపున మిస్ ఇండియా నందిని గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు శనివారం సాయంత్రం గచ్చిబౌలి స్టేడియంలో జయజయహే తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపనతో పోటీలు మొదలయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పరిచయ కార్యక్రమంలో భాగంగా పోటీదారులు విభిన్న వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, నగర మేయర్ విజయలక్ష్మీ,మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, మిస్ వరల్డ్2024 విజేత క్రిస్టినా పిస్కోవా తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.

# అనుమతుల్లేని భవనాలతో భద్రత కరవు

- వరుస ఘటనలతో బేంబెలెత్తుతున్న జనాలు
- క్వాలిటీ లేని కరెంట్ వైర్లు.. మెత్తటి వస్తువులే
- ప్రమాదం జరిగినా కానరాని భద్రత పరికరాలు

**హైదరాబాద్న, మే10, ప్రభాతవార్త:** ఒక భారీ భవనం నిర్మించేప్పుడు అన్నివిధాల భద్రత చాలా ముఖ్యం. సంపాదనే పరమవిధిగా అన్ని మరిచిపోయి చివరకు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. కనీసం వెంటిలేషన్, గాలి లేని ఇరుకిరుకు గల్లీల్లో ఆకాశానికి తాకే నిర్మాణాలను ఇష్టారాజ్యంగా కడుతూ అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నారు. క్వాలిటీ లేని కరెంటు కేబుళ్లు, మెత్తటి వస్తువులు ఉండడంతో చిన్నపాటి అగ్గిరవ్వలు పడిన మంటలు అంటుకుంటున్నాయి. దీంతో భారీస్థాయిలో నష్టంవాటిల్లుతోంది. అగ్నిమాపక శాఖ నిబంధనలు, సూచనలు పాటించడం లేదు. ఎన్వోసీ (నో అబ్జెక్షన్ లెటర్) లేకుండా పరిమితికి మించి కట్టడాలు సాగిస్తున్నారు. కనీసం భద్రత పరికరాలు లేని పరిస్థితి. ఫైర్‌ఇంజిన్ రాలేని దుస్థితి నగర భవనాలపై కనిపిస్తోంది. చర్యలు తీసుకోవాల్సిన జీహెచ్ఎంసీ, ఆయా శాఖల అధికారులు ఆమ్యామ్యాలతో చూసిచూడనట్లు వదిలేస్తున్నారు. ఘటన జరిగితేనే నిర్లక్ష్యం, తప్పులను ఏవేవో సాకులతో కప్పిపుచ్చుకుంటున్నారు. తాజాగా చందానగర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.

**ఆ శాఖ 'అనుమతి'నే మరిచిందా..**

నగరంలో పదిహేను అడుగులు జీప్లస్ రెండతస్తుల వరకు జీహెచ్ఎంసీ అనుమతులివ్వాలి. ఆపైన నిర్మాణాలకు ఫైర్‌డిపార్ట్‌మెంట్‌ది ఉండాలని నిబంధనలు చెబుతున్నారు. ఇవి మచ్చుకైన కానరాకుండా మారింది. ఎన్నో భవనాలు అగ్నిమాపక శాఖ నిబంధనలను అతిక్రమించి కడుతుండడంతో అనుమతులు ఇవ్వడం కుదరదు, దీంతో డబ్బులు తీసుకొని మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారు. ఎక్కడో ఒక చోట భవనం అక్రమంగా ఉన్న పర్మిషన్ ఇస్తే అవినీతి బయటపడుతుందనే కారణాలతో చాలా వరకు నోటీ మాటలతో పనికానిస్తున్నారు సంబంధిత అధికారులు. ఇక అగ్నిమాపక శాఖ తమకు ఎం తెలియదనుకుంటూన్నే అంతర్గతంగా వ్యవహారాలు నడిపించి భారీస్థాయిలో ముడుపులు కూడబెట్టుకుంటుందనే ఆరోపణలు వెలుగుచూస్తున్నాయి. భవన యజమానులు ఇష్టారాజ్యంగా కట్టడాలు చేస్తుండడంతో సామాన్య ప్రజలే అధికంగా నష్టపోతున్నారు.ఆయా శాఖల నిర్లక్ష్యంతో ఆస్తినష్టాలు ఎక్కువగానే ఉంటు న్నాయి. ప్రాణనష్టాలే అతి తక్కువగానే కనిపి స్తుంటాయి.

**క్వాలిటీ లేని కేబుళ్లేనా..?**

వ్యాపారం చేసే భవన యజమానులు కనీసం క్వాలిటీ వైర్లను కూడా అమర్చలేని దౌర్భాగ్యం దాపరించింది. చిన్నపాటి వైర్లకే హైవోల్టేజీ సరఫరా, ఎక్కువ సామర్థ్యం ఉన్న రెండు, మూడు మిషిన్లతో వైర్లు మెత్తబడి రెండు కలిసి షార్ట్‌సర్క్యూట్‌తో మంట ఏర్పడే అవకాశం ఉంటుందని ఎలక్ట్రిసిటి డిపార్ట్‌మెంట్ విశ్రాంత అధికారులు చెబుతున్నారు. ఏదైన ఘటన జరిగినప్పుడు మంటలను అదుపు చేయాల్సిన భద్రత పరికరాలు లేకుండా పోతున్నాయి. ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, నీటిపైప్‌లైన్లు, తదితర పరికాలను అమర్చుకోవాలని అధికారులు ప్రతీసారీ సూచనలు చేస్తున్నారు. మండే స్వభావమైన రసాయనాలు, మెత్తటి దుస్తులు, ప్లాస్టిక్స్‌లతో పాటు మరికొన్నింటికి దూరంగా ఉంచడంతో ప్రమాదాలను నివారించవచ్చు. ముఖ్యంగా స్విచ్ బోర్డులు, మీటర్లు, ఎల్పీజీ గ్యాస్ పక్కన బటన్‌లు, ఫ్యూజ్‌ల ఇలా ఎన్నో వాటిపై భద్రత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఏదైన ఘటన జరిగితేనే అగ్నిమాపకశాఖ, జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లు హడావిడి చేసి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. శాఖల నిర్లక్ష్యంతోనే భవన యజమానులు అక్రమాలకు పాల్పడుతూ ఎన్నో ప్రమా దాలకు పరోక్షంగా కారకులవుతున్నారనేది స్పష్టం గా తెలుస్తోంది. ఇప్పటికైన అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను గుర్తించడంతో పాటు భారీ వాణిజ్య సంస్థల పై ఫైర్‌సేఫ్టీ నిబంధనలను పరిశీలించి చర్య లు చేపడితే కొంతవరకైన నివారించవచ్చని పే ర్కొంటున్నారు.

## బాణసంచా కాల్చొద్దు..డ్రోన్‌లు నిషేదం

**హైదరాబాద్, మే10, ప్రభాతవార్త:** భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా బహిరంగప్రదేశాలు, కంటోన్మెంట్ ప్రాంతాల్లో బాణసంచాలను కాల్చి అభద్రతభావం ఏర్పాటు చేయకూడదని నగర సీపీ సీవీ. ఆనంద్ తెలిపారు. దీనిపై నిషేదం ప్రకటిస్తున్నట్లు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఆందోళనలో ఉన్న వారిని క్రాకర్స్ శబ్ధాలతో భయపడే ఆస్కారం ఉంటుందని వివరించారు. టపాసుల మోతలు ఉగ్రవాద పేలుళ్లనే తప్పుగా భావించే అవకాశం ఉంటుందని వెల్లడించారు. అతిక్రమించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు.



నగర సీపీ సీవీ.ఆనంద్

**శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిధిలో డ్రోన్ నిషేదం...**

శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిధిలో డ్రోన్ల వినియోగంపై నిషేదించినట్లు సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతీ పేర్కొన్నారు. విమానశ్రయానికి పదికిలోమీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయని వివరించారు. జూన్ 9వరకు అమలులో ఉంటాయని, ప్రయాణీకుల దృష్ట్యా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## తలసేమియా జననాలను పూర్తిగా నిలిపివేయాలనేది లక్ష్యం



గవర్నర్ జిష్ణుదేవ్‌కు తలసేమియా గురించి వివరిస్తున్న డా.చంద్రకాంత్ అగర్వాల్

**సైఫాబాద్, మే 10 ప్రభాతవార్త:** తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టిఎస్‌సిఎస్) బృందం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి తలసేమియా నిర్మూలనకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం నాడిక్కడ సొసైటి కేంద్రంలోని రోగులు, వారి కుటుంబాలు, వైద్య నిపుణులు, ఇతర సభ్యుల తలసేమియా దినోత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వైద్యులు తలసేమియా వ్యాధి గురించి అవగాహన కల్పించడం తోపాటు చికిత్స విధానాలు, నివారణ తదితర అంశాలపై బాధిత కుటుంబ సభ్యులతో చర్చించారు. తలసేమియా ఇంటర్‌నేషనల్ ఫెడరేషన్-2025 టుగెదర్ ఫర్ తలసేమియా యునైటింగ్ కమ్యూనిటీస్ ప్రయోరిటైజింగ్ పేషెంట్స్ అనే థీమ్‌కు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటి అధ్యక్షుడు డా.చంద్రకాంత్ అగర్వాల్ మాట్లాడుతూ చికిత్సకంటే నివారణే మేలు అనే నినాదంతో 2035 నాటికి తలసేమియా జననాలను పూర్తిగా నిలిపివేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ప్రముఖ గాయని, ఇండియన్ ఐడల్ పోటీదారు రాగిణి షిండే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## జింక మాసం పట్టివేత

**హైదరాబాద్,మే10, ప్రభాతవార్త:** అటవీశాఖ నిబంధనలకు విరుద్దంగా జింక మాసం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం టోలిచౌకికి చెందిన హాసన్‌బక్రన్ (50) ట్రావెల్స్ ఏజెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు మహారాష్ట్రకి చెందిన రిజ్వాన్ నుంచి తక్కువ ధరలో కొనుగోలు చేశాడు. అనంతరం నగరంలోని అతని స్నేహితుడు అయిన షేక్ అబ్దుల్‌రహ్మాన్ (54), అహ్మద్‌బిన్ బక్వాని (54)లకు విక్రయిస్తున్నా డు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. నిందితుల నుంచి మూడు కేజీల జింక మాంసాన్ని స్వాధీనం చేసుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి

### -వివాహాన్ని చెడగొట్టిన యువకుడిపై కేసు నమోదు

**బేగంపేట మే 10,ప్రభాతవార్త :** తనను వివాహం చేసుకోవాలంటూ ఒక యువతిని ఒత్తిడి చేయడమే కాకుండా ఆమె నిశ్చితార్థాన్ని చెడగొట్టి ఎవరైనా యువతిని పెళ్లి చేసుకుంటే వారిని చంపేస్తానంటూ బెదిరించిన యువకుడిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసారు.పోలీసులు తెలియజేసిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.నిజామాబాద్ బాల్కొండ ప్రాంతినికి చెందిన యువతి (21) నగరంలోని ఒక హాస్టల్ లో ఉంటూ డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతుంది. కామారెడ్డిలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసే శేషుకుమార్ (28)తొమ్మిది నెలల క్రితం ఆ యువతిని బస్సులో కలిసాడు.ఒక నెల తర్వాత శేషు ఆమెను పెళ్లి చేసుకోవాలంటూ అడిగాడు.దీనికి ఆమె నిరాకరించి స్నేహితులుగా ఉందామని చెప్పింది.ఈ క్రమంలో ఇరువురూ కల్సి ఫోటోలు దిగారు.ఇదే సమయంలో తన వివాహ నిశ్చితార్థం ఖరారు అయిందని యువతి స్నేహితులకు చెప్పింది.వారి ద్వారా విషయం తెల్సుకున్న శేషు ఈ నెల 6న సాయంత్రం గం 5.30నిలకు బేగంపేట ఫ్లై ఓవర్ వద్ద యువతిని కల్సుకున్నాడు.ఇదే సమయంలో యువతి చెంపలపై కొట్టాడు.యువతిని వివాహం చేసుకునే యవకుడి ఫోన్ నెంబర్ తీసుకుని వారిద్దరూ కల్సి దిగిన ఫోటోలను అతనికి పంపించాడు.యువతిపై లేని పోని అనుమానాలు కలిగే విధంగా చేసాడు.దీంతో నిశ్చితార్థం నిల్చిపోయింది.అనంతరం తనను పెళ్లి చేసుకోవాలంటూ యువతిపై ఒత్తిడి పెట్టాడు.తనను కాదని వేరే వారిని పెళ్లి చేసుకుంటే చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధిత యువతి బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**మార్ఫింగ్ ఫొటోలతో బెదిరింపులకు దిగిన వ్యక్తిపై కేసు నమోదు..**

**పంజగుట్ట, మే10 (ప్రభాతవార్త):** తనపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోకపోతే మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో విడుదల చేస్తానని బెదిరిస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసునమోదు చేశారు. వివరాల ప్రకారం..బంజారాహిల్స్‌లోని సువర్ణభూమి రిసార్ట్స్ సంస్థలో గతంలో డైరెక్టర్‌గా పనిచేసిన మంచాల సాయి సుధాకర్ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై సంస్థ నిర్వాహకులు గతంలో ఆయనపై కేసునమోదే చేశారు. దీంతో ఆయనను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపారు. జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత సంస్థపై కక్ష పెంచుకుని అనేకరకాల ప్రయత్నాలు మొదలుపెట్టాడు. దీనికి ప్రతీకార దాడిగా మార్ఫింగ్ ఫొటోలు సృష్టించి బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. తనపై కేసులు వెనక్కు తీసుకోకపోతే ఈ ఫొటోలను సోషల్ మీడియాలో విడుదల చేస్తానని తరచూ బెదిరింపులకు దిగాడు. దీంతో సంస్థ ప్రస్తుత డైరెక్టర్ బంజారాహిల్స్ పోలీ సులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## టర్కి కాన్సులెట్ కార్యాలయానికి భారీ భద్రత ఏర్పాటు

**హైదరాబాద్, మే10, ప్రభాతవార్త:** భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో పాక్‌కు టర్కీ దేశం మద్దతు పలికి ఆయుధాల సాయం చేస్తుండడంపై నగరంలోని టర్కీ కాన్సులెట్ జనరల్ కార్యాలయానికి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్‌లో ఉన్న కార్యాలయానికి ఆందోళనకారులు వచ్చి దాడి చేసే అస్కారం ఉండడంతో ముందస్తుగా సైబరాబాద్ పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. పరిసరా ప్రాంతాల్లో నిఘా పెట్టి పర్యవేక్షిస్తూ చర్యలు చేపట్టారు. సమీపంలోకి ఎవరిని కూడా రాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు.

## సైన్యం చేపట్టే ప్రతి చర్యకు అండగా నిలుస్తాం

### - వి.హనుమంతరావు




జ్యోతిబాపూలే విగ్రహం నుండి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, మే 10, ప్రభాతవార్త:** మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ ఎంపి వి.హనుమంతరావు గారి ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైన్యానికి సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ దుశ్చర్యను నిరసిస్తూ అంబర్‌పేటలోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం నుండి శ్రీరమణ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వి.హనుమంతరావు మాట్లాడుతూ పాకిస్తాన్‌లో ఉగ్రవాదులను ఏరి వేయడానికి భారత సైన్యం అద్భుతంగా పోరారటం చేసిందన్నారు. పహల్గాంలో అమాయకులైన 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపడం కలిచివేసిందన్నారు.ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతో భారత సైన్యం విరోచితంగా పోరాడిందన్నారు. భారత సైన్యాం చేపట్టే ప్రతి చర్యకు భారత ప్రజలు అండగా నిలుస్తారని పేర్కొన్నారు.ఇరు దేశాల కాల్పుల విరమణ, సైనిక చర్యలను నిలిపివేసినా..ఉగ్రవాదం విషయంలో మాత్రం భారత్ రాజీలేని వైఖరిని కొనసాగిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో నాంపల్లి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఫిరోజ్‌ఖాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్,పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పి.నారాయణస్వామి, పులి జగన్, దిడ్డి రాంబాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గరిగంటి రమేష్, రోహిత్, సత్తిబాబు, రామ్మోహన్, కృష్ణగౌడ్, రాజేశ్వరరావు, ఠాకూర్ హరితిలక్‌సింగ్, అనిల్ ప్రభాకర్, జమీర్, ఫరీద్, లక్ష్మణ్, మహ్మద్, విజితారెడ్డి, కవిత, శ్రీనివాస్‌రెడ్డి, షేక్ సర్ఫరాజ్, మన్మోహన్, వంశీ పాల్గొన్నారు.

### స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,మే 10 ప్రభాతవార్త:** స్వామి వారి ఆశీసు స్సులు ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని, అందరు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు కంటోన్మెంట్ నియోజక వర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. తుకారాంగేట్ జె.ఎల్.ఎన్. ఎస్.నగర్ లోని శ్రీ జయగిరి లక్ష్మి నర్సింహ్మా స్వామి దేవాలయంలో నిర్వహించిన ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవా లయ కమిటీ చైర్మన్ బాలరాజు యాదవ్,మేకల రాము, కనుమల నాగ రాజు, కొమురయ్యలతో పాటు భక్తులు పెద్ద ఎసంఖ్యలో పాల్గొన్నారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అభినందనలు తెలిపిన ఆనంద్ బాబు**

**కంటోన్మెంట్,మే 10 ప్రభాతవార్త:** బిసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి అన్ని పార్టీల సంపూర్ణ మద్దతుతో కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు కృషి చేసిన రాష్ట్ర రవాణా శాఖ, బిసీ సంక్షే మ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు చైర్మన్ ఆర్. ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్‌లు మర్యాదపూ ర్వకంగా కలిసి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించా రు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు మాట్లాడుతూ తెలంగాణ కోసం తన ప్రాణాలనై సైతం అడ్డుపెట్టి రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని,కులగణన, బిసీలకు రిజర్వేషన్లు పెంచేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కే దక్కిందన్నారు.

### కెపిహెచ్‌బి కాలనీలో వీర జవాన్లకు మద్దతుగా ర్యాలీ

**కెపిహెచ్బి కాలనీ, మే 10, ప్రభాతవార్త** శ్రీనగర్‌లోని పహెల్గాంలో జరిగిన ముష్కరుల దాడికి నిరసనగా భారత్ మధ్యల జరుగుతున్న దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికుడు మురళి నాయక్‌కు నివాళులర్పిస్తూ శనివారం కెపిహెచ్బి కాలనీలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక నాయకులు కోదండరా మయ్య ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ 4 ఫేసుల్లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి వీర జవాన్లకు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో కట్టా నర్సింగరావు గణేష్ నాయక్, రామ్లా నాయక్, శీనా నాయక్, ప్రసాద్ నాయక్, మోహన్ నాయక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

### పేదవారికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

**కెపిహెచ్బి కాలనీ, మే 10, ప్రభాతవార్త** పేద ప్రజలకు పార్టీ తరపున ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కెపిహెచ్బి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం కెపిహెచ్బి కాలనీ 7వ పేస్‌లోని బాస్కెట్ బాల్ గ్రౌండ్లో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ వైద్య శిబిర నిర్వాహకులైన రంగ, నితీష్ గౌడ్, ప్రవీణ్ కుమార్, పొడుగు అప్పారావు, అరవింద్ రెడ్డి ,రంగస్వామిలను అభినందించారు. భవిష్యత్తులోనూ పార్టీ నాయ కులు మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

